# సాక్షి
## నంద్యాల

సోమవారం ၊ 1 ၊ మే ၊ 2023






### అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



### మంత్రాలయంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. దర్శనానికి గంటకుపైగా సమయం పట్టింది.



### పిడుగుల కాలం..

కర్నూలు(అగ్రికల్చర్): రానున్న రోజుల్లో అకాల వర్షాలు కురిసి పిడుగుల పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.

## న్యూస్‌రీల్

### నేడు వినూత్న రీతిలో 'స్పందన'

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కారం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినీర హాల్‌లో నిర్వహించే స్పందనను నేడు వినూత్న రీతిలో నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ శాఖకు సంబంధించి అర్జీలు అధికంగా వస్తున్నాయో ఆయా విభాగాలకు సంబంధించిన అధికారులు ప్రత్యేకంగా టేబుళ్లు ఏర్పాటు చేసుకుని అర్జీదారుని సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుంటారన్నారు. ఆ తర్వాతనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో సమస్యను పరిష్కరించేందుకు ప్రయోగాత్మకంగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దీంతో సమయం వృథా కాకుండా సమస్యను పూర్తిగా విని సత్వర పరిష్కారం అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరుకావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు.

### ఎస్పీ కార్యాలయంలో నేడు స్పందన రద్దు

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా కేంద్రంలోని బొమ్మలసత్రం వద్ద ఉన్న ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారులు వారి సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్లలో, డీఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు.

### అన్నదాన పథకానికి రూ. 5 లక్షల విరాళం



దాతకు జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి వెంకటగిరికి చెందిన శీల సాయితేజ ఆదివారం రూ.5,01,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని దేవస్థానం కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో ఈఓ ఎస్. లవన్నకు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, విరాళానికి సంబంధించిన బాండు, జ్ఞాపికను అందజేశారు.

### నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

నంద్యాల(సిటీ): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు నేటి (సోమవారం) నుంచి వేసవి సెలవులు ఉంటాయని జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మే1వ తేదీ నుంచి జూన్11వ తేదీ వరకు ఈ సెలవులు ఉంటాయన్నారు. తిరిగి పాఠశాలలు జూన్ 12న పునః ప్రారంభం అవుతాయన్నారు. వేసవి సెలవులలో విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండి, పాఠశాలల్లో ఇచ్చిన హోమ్ వర్క్‌ను చేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. అదేవిధంగా సెలవుల్లో ఎవ్వరూ పాఠశాలలు నిర్వహించకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### కుంభాభిషేక ఏర్పాట్ల పరిశీలన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న మహాకుంభాభిషేక మహోత్సవ ఏర్పాట్లను శ్రీశైల దేవస్థాన కార్యనిర్వాహణాధికారి లవన్న ఆదివారం పరిశీలించారు. శిఖరేశ్వర ఆలయ మెట్ల మార్గంలో మరమ్మతులు, శిఖరేశ్వరం ఆలయ కటాంజనాలకు పెయింటింగ్, ఎలక్ట్రికల్ వైరింగ్ పనులు చేపట్టాలని ఆదేశించారు. శిఖరేశ్వరం పుష్కరిణిని శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఫాలధార, పంచధార ప్రవేశద్వార సమీపంలో ఆదిశంకరాచార్యులు విగ్రహవేదికను మరింత విస్తరింపజేయాలని ఆదేశించారు. వేదికకు గ్రానైట్‌బండపరుపును వేయాలని సూచించారు. హటకేశ్వరం ఆలయ ప్రాంగణంలో బిల్వం, కదంబం, ఉసిరి మొక్కలను పెంచాలని సూచించారు. అన్ని ఆలయాల వద్ద కూడా కుంభాభిషేక నిర్వహణకు ఏర్పాటు చేసి పరంజాలు ధృడంగా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.రామకృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఎమనరసింహారెడ్డి, సహాయ స్థపతి జవహర్‌లాల్, ఉద్యాన వన విభాగ అధికారి లోకేష్ తదితరులు ఉన్నారు.

# లక్ష్యం కోటి.. కూలీ ఖుషి!

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు పేదలకు వరంగా మారాయి. జాబ్ కార్డు ఉంటే ఊరిలోనే అడిగిన వెంటనే ఉపాధి కల్పిస్తుండటం, దినసరి కూలి పెంచడం.. సక్రమంగా డబ్బులు జమ చేస్తుండటంతో కూలీలు పనుల వైపు ఆసక్తి చూపుతున్నారు. పనులు జరిగే చోట్ల అధికారులు సౌకర్యాలు పెంచడం, వేసవి దృష్ట్యా వైద్య సేవలు అందుబాటులో ఉంచడంతో కూలీల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా రోజుకు లక్ష మంది దాక హాజరవుతుండటంతో అధికారులు లక్ష్యానికి చేరవవుతున్నారు.

- జిల్లా వ్యాప్తంగా జోరుగా ఉపాధి హామీ పనులు
- అడిగిన చోటే పనులు కల్పిస్తున్న ప్రభుత్వం
- పెరిగిన వేతనం, సంతృప్తిగా సౌకర్యాల కల్పన
- చెరువులు, కాలువల అభివృద్ధి పనులకు ప్రాధాన్యం
- భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా కార్యాచరణ



కూలీలకు అందుబాటులో ఉంచిన మెడికల్ కిట్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు



మిట్టపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

**జిల్లాలో క్లస్టర్ల వారీగా ప్రతి రోజు ఉపాధి పనులు ఇలా..**

| క్లస్టర్ | మండలాలు | పనిదినాల లక్ష్యం | కూలీల హాజరు |
|---|---|---|---|
| ఆత్మకూరు | 7 | 32,000 | 26,034 |
| డోన్ | 5 | 30,800 | 20,477 |
| కోవెలకుంట్ల | 8 | 29,000 | 22,746 |
| నంద్యాల | 8 | 43,900 | 18,198 |
| మొత్తం | 28 | 1,35,700 | 90,816 |

ఆళ్లగడ్డ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల లక్ష్యాన్ని అధిగమించేందుకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. 2023 – 24 కింద ఏప్రిల్ 1 నుంచి జూన్ నెలాఖరులోపు కోటి పనిదినాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇందుకు అనుకూలంగా డ్వామా అధికారులు ప్రణాళికలు రూపొందించి అడిగిన వారందరికీ పని కల్పిస్తూ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు మండల, గ్రామ అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా గ్రామాల్లో ముందుగానే పనులు గుర్తించి కూలీలకు ఉపాధి చూపిస్తున్నారు. ఏప్రిల్ 1 నుంచి 25వ తేదీ వరకు 4,31,688 పనిదినాలు కల్పించారు. జిల్లాలో 2,78,554 కుటుంబాల్లోని 5,24,210 మంది హాజరు నమోదు కాగా రోజు పనిదినాల లక్ష్యం 1,35,700 గా నిర్దేశించగా ప్రస్తుతం 90,816 మంది కూలీలు హాజరవుతున్నారు. దీంతో ఈ ఏడాది కోటి పనిదినాల లక్ష్యం పూర్తవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వేతనం నిబంధనల మేరకు వస్తుందనే నమ్మకంతో ఇటీవల వ్యవసాయ కూలీలతో పాటు సన్న, చిన్న కారు రైతు కుటుంబాల సభ్యులు కూడా ఉపాధి పనుల వైపు మొగ్గు చూపుతున్నారు. అలాగే వేసవి సెలవుల్లో అనేక మంది చదువుకున్న యువతి, యువకులు సైతం ఉపాధి పనులకు వెళ్తుండటంతో కూలీల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గతంలో వ్యవసాయ అనుబంధం పనులు కాకుండా ఇతర పనులు నిర్వహించడంతో కొంత మేరకే ప్రయోజనం కలిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి వ్యవసాయ అనుబంధ పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో పంట కాల్వలు, చెరువుల్లో పూడికతీత, కాలవల్లో ముళ్ల పొదలు, కంప చెట్లు తొలగించడం చేపట్టడంతో కూలీలు కూడా ఆసక్తి చూపుతున్నారు.

**పెరిగిన కూలి..**

ఉపాధి హామీ పథకం పనులకు దినసరి కూలి రేట్లను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో కూలీలకు ప్రయోజనం చేకూరుతోంది. ఇప్పటి వరకు కూలీలకు రూ. 257 చెల్లిస్తుండగా ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అదనంగా రూ. 15 పెంచి దినసరి కూలి రూ. 272 అందిస్తోంది.

**పరిహారం పెంపు..**

ఉపాధి పనులు చేస్తున్న సమయంలో కూలీలు ప్రమాదవశాత్తూ మృతి చెందినా, గాయపడినా అందించే పరిహారాన్ని ప్రభుత్వం పెంచింది. పనిచేస్తున్న సమయంలో కూలీలకు గాయాలయితే గతంలో రూ. 25 వేలు ఇస్తుండగా ఇప్పుడు దానిని రూ. 50 వేలకు పెంచారు. చికిత్సకు అయిన ఖర్చును బట్టి రూ. లక్ష వరకు చెల్లిస్తారు. అంగవైకల్యం చెందితే గతంలో రూ. 50 వేలు ఇస్తుండగా ఇప్పుడు దానిని రూ. లక్షకు పెంచారు. ప్రమాదంలో ఛాతినొప్పి, గుండెపోటు, వడదెబ్బతో మృతి చెందితే ఇంతకుముందు రూ. 50 వేలు చెల్లించేవారు. ఇప్పుడు రూ. 2 లక్షలు పరిహారం అందిస్తున్నారు.



టెంట్ల కింద సేద తీరుతున్న కూలీలు

### సకాలంలో అకౌంట్లలో డబ్బులు జమ



ఊరిలో వ్యవసాయ పనులు లేని కాలంలో రోజు రూ. 250 వరకు వేతనం సంపాదించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించడం సంతోషం. మా ఇంట్లో రోజు నలుగురం పనికి వస్తుండటంతో రోజుకు రూ. 1000 దాకా వస్తోంది. కూలి డబ్బులు కూడా సకాలంలో అకౌంట్‌లో పడుతున్నాయి. వారానికి రూ. 6 వేల నుంచి రూ .7 వేల వరకు వస్తోంది. పనులు లేవు అనుకుంటున్న సమయంలో ఉపాధి హామీ పనులు ఆసరాగా నిలిచాయి. – అనురాధ, ఉపాధి కూలీ, జమ్మలదిన్నె

### వసతులు బాగున్నాయి



ఎండాకాలంలో వ్యవసాయ పనులు లేక ఇబ్బందులు పడుతున్న మాకు అధికారులు ఉపాధి పనులు కల్పించారు. కూలీ డబ్బులు పెంచడంతో పాటు ఏదైనా ప్రమాదం జరిగితే ఇచ్చే పారితోషికం కూడా బాగా పెంచారు. దీనికి తోడు పని చేసే చోట నీడ కోసం టెంట్, మందులు, ఓఆర్‌ఎస్ పాకెట్లు అన్ని అందుబాటులో ఉంచుతుండటంతో ఎంత ఎండ పెడుతున్నా ధైర్యంగా పనికి పోతున్నాం.

– సుహాసిని, ఉపాధి కూలీ, క్రిష్టిపాడు

### లక్ష్యాన్ని చేరుకుంటాం



కూలీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. అర్హత ఉండి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు మంజూరు చేస్తున్నాం. జాబ్ కలిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఎన్ఐసీ సర్వర్ అమల్లోకి రావడంతో పనులు పూర్తి పారదర్శకంగా జరుగుతున్నాయి. ఏడాది నిర్దేశించుకున్న పనిదినాల లక్ష్యం పూర్తి చేస్తాం.

– రామచంద్రారెడ్డి, డ్వామా పీడీ

## నేటి నుంచి ఆర్జిత సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే

- శీఘ్ర, అతిశీఘ్రదర్శన టికెట్లు 70 శాతం కరెంట్ బుకింగ్‌లో
- ప్రొటోకాల్ దర్శనం వేళల్లో మార్పులు
- యథావిధిగా కొనసాగనున్న ఉచిత స్పర్శ దర్శనం
- శ్రీశైల దేవస్థానం ఈఓ లవన్న



ఈఓ ఎస్ లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం అన్ని ఆర్జిత సేవలు, స్వామివారి స్పర్శదర్శనం టిక్కెట్లు అన్ని సోమవారం నుంచి ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉంటాయని శ్రీశైలదేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్ లవన్న తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవస్థానం నిర్వహించే అన్ని ఆర్జిత సేవలు, స్వామివారి స్పర్శదర్శనం టిక్కెట్లు ఇక నుంచి కరెంట్ బుకింగ్ ద్వారా ఇచ్చే అవకాశం ఉండదని తెలిపారు. మే నెలకు సంబంధించి ఆర్జిత, స్పర్శదర్శనం టిక్కెట్లు ఏప్రిల్ 25 నుంచే భక్తులకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామన్నారు. దేవస్థానం వెబ్‌సైట్ www.srisailadevastanam.org ద్వారా భక్తులు ఆయా టిక్కెట్లును ముందస్తుగా పొందవచ్చునన్నారు. శీఘ్రదర్శనం రూ.150, ఆతిశీఘ్రదర్శనం రూ.300, టిక్కెట్లు 30 శాతం ఆన్‌లైన్‌లో, 70 శాతం కరెంట్ బుకింగ్ ద్వారా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు ప్రతి రోజు మధ్యాహ్నం భక్తులకు ఉచితంగా కల్పించే స్వామివారి స్పర్శదర్శనం యథావిధిగా కొనసాగుతుందన్నారు. ఆయా సేవా టికెట్లను ఆన్‌లైన్ ద్వారా పొందిన భక్తులు ప్రింట్ కాపీ, ఆధార్‌కార్డులను తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని సూచించారు. అలాగే సర్వదోష నివారణ పూజ, అక్షరాభ్యాసం, అన్నప్రాసన టిక్కెట్లు కరెంట్‌బుకింగ్ ద్వారా కూడా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సామాన్య భక్తులు ఇబ్బందులు ఎదుర్కొకుండా అన్ని ఆర్జిత సేవలు, స్పర్శదర్శనం నిర్దిష్ట వేళల్లోనే నిర్వహించబడతాయని తెలిపారు. ఆలయానికి వచ్చే ప్రముఖులు, కనీసం రెండు రోజులు ముందుగా వారి పర్యటన వివరాలను తెలియజేయాల్సి ఉంటుందని అన్నారు. వసతి ఏర్పాట్లుకు సంబంధించి, సిఫారసుకు సంబంధించి ప్రముఖులందరూ కూడా వారి లెటర్ హెడ్‌పై కనీసరం రెండు రోజులు ముందుగా దేవస్థానానికి సమాచారం తెలియజేయాలని కోరారు. ఈ లేఖలను protocol@srisailadevastanam.org మెయిల్ ఐడీకి, ప్రొటోకాల్ ఫోన్ నెంబర్ 9160016215కు వాట్సాప్ ద్వారా కూడా పంపవచ్చునని తెలియజేశారు. సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతంగా శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు వీలుగా ఈ మార్పులు చేసినట్లు ఈఓ పేర్కొన్నారు.



### అపురూపుడు.. వేణుగోపాలుడు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం ఎగువ అహోబిలంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాలు కనులపండుగా కొనసాగుతున్నాయి. ఆదివారం శ్రీ జ్వాల నరసింహస్వామి వేణుగోపాలస్వామి అలంకరణలో భక్తులను కనువిందుచేశారు. స్వామివారిని పల్లకీలో ఉంచి మాఢవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి స్వామివారు పొన్నుచెట్టు వాహనంపై విహరించారు.

## మారాము లేక.. మదినిండా దిగులు

- తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
- కనిపించని ఏడు నెలల బాలుడు
- కొనసాగుతున్న రైల్వే పోలీసుల గాలింపు చర్యలు



దిగాలుగా కూర్చున్న బాధిత తల్లిదండ్రులు



చిన్నారి రాము

మంత్రాలయం: వారిది ఊరుగాని ఊరు. ఉసూరుమనిపించే బతుకు. దార్రిద్యంలో నలుగుతున్న దీనావస్థ. భిక్షమెత్తితేనే నోట్లోకి నాలుగేళ్లు. శవాలు మోస్తేనే మెతుకులు. ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకుని బతుకీడ్చే జీవితాలు. చెట్ల కింద కాలం వెళ్లదీసే కడుదయనీయ దుస్థితి. వీరికున్న ఒకే ఒక సంతోషం కుమారుడు. మారాం చేసే ఏడు నెలల మగబిడ్డ అదృశ్యం కావడంతో వారు దిక్కులు చూస్తున్నారు. 'ఏ ఒక్కరికీ మేం హానీ చేయలే.. అడుక్కుని తిని బతుకున్నాం.. మా రాము కనిపిస్తే చెప్పండయ్యా' అంటూ కనిపించిన వారినందరినీ అడుగుతూ విలపిస్తున్నారు.

**సీసీ ఫుటేజీలో ఇద్దరు అనుమానితులు**

గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన వడ్డె ఆంజనేయులు, అంకమ్మ పదేళ్ల క్రితం బతుకు తెరువు కోసం తుంగభద్ర గ్రామానికి వచ్చారు. వీరికి యల్లక్క (5), కనకమ్మ(3), రాము(7 నెలలు) సంతానం. స్థానిక పాత రైల్వేస్టేషన్‌లోని శౌచాలయం (మూత్రశాల)లో తలదాచుకుంటుకున్నారు. రైల్వే స్టేషన్ పరిధిలో ప్రమాదాల బారిన పడిన శవాలను మోస్తూ వడ్డె ఆంజనేయులు పోలీసులకు ఆసరాగా ఉంటూ వస్తున్నాడు. రైలు పట్టాలపై శవాలను తీయడం, అంతిమ సంస్కారాలు చేయడం చేస్తాడు. ఆయన భార్య అంకమ్మ చిన్నారులతో భిక్షాటన చేయడం, ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకుని పిల్లలను పోషిస్తోంది. ఇటీవల ఆలూరు నియోజకవర్గం గూళ్యం జాతరకు పోయి వచ్చారు. తలదాచుకునే శౌచాలయాన్ని కూల్చివేయడంతో ఆ కుటుంబ సభ్యులు రైల్వే పట్టాలను ఆనుకుని ఉన్న చెట్టుకిందకు చేరారు. చెట్టుకిందనే బతుకు సాగిస్తూ వస్తున్నారు. శుక్రవారం రాత్రి వాన కురవడంతో శిథిలమైన పాత రైల్వేస్టేషన్ ముఖద్వారంలోకి వెళ్లారు. అప్పటికే అక్కడ ఇద్దరు వ్యక్తులు కునుకు తీస్తున్నారు. పిల్లాపాపలు నిద్రలోకి జారుకోవడంతో ఇరువురు తలవాల్చారు. వేకువ జామున 4.30 గంటల ప్రాంతంలో లేచిచూడగా బాలుడు రాము కనిపించలేదు. ఆ పక్కనే నిద్రిస్తున్న వ్యక్తులు కూడా అక్కడ లేకపోయారు. దీంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తూ తుంగభద్ర గ్రామంలోకి వచ్చారు. పిల్లాడి కోసం ఆరా తీస్తుండగా ఓ హోటల్ నడిపే వ్యక్తి చిన్నారి ఏడుపులు వినిపించాయని, ఇద్దరు బైకుపై ఉన్నారని పేర్కొన్నాడు. రైల్వే పోలీసులు ఇదే కోణంలో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. రాత్రి 2 గంటల ప్రాంతంలో గ్రామంలో ఇద్దరు వ్యక్తులు సంచరిస్తూ కనిపించారు. ఇదే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## పీఎంశ్రీ.. పాఠశాల పురోభివృద్ధి

- సర్కారు బడుల ఆధునికీకరణకు కేంద్రం చేయూత
- పీఎంశ్రీ పథకానికి జిల్లాలో 28 పాఠశాలలు ఎంపిక
- నేరుగా స్కూళ్లకు జమ కానున్న నిధులు
- మరింత మెరుగుపడనున్న వసతులు



పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన కొలిమిగుండ్ల మోడల్ స్కూల్

కొలిమిగుండ్ల: ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను నాడు –నేడుతో ప్రక్షాళన చేస్తుండగా కేంద్ర ప్రభుత్వం కూడా చేయూత అందించేందుకు సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. నూతన విద్యావిధానం అమలు చేసే కార్యక్రమంలో భాగంగా ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకాన్ని అమలుల్లోకి తీసుకొచ్చింది. ఈ పథకం కింద అర్హత ఉన్న పాఠశాలల జాబితా ఇటీవల విడుదల కాగా జిల్లాలో 28 పాఠశాలలు ఎంపిక అయ్యాయి. ఈ పాఠశాలల అభివృద్ధి కోసం కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటా 40 శాతం నిధులను కేటాయించనుంది. డ్రిస్టిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ (యూడైస్ ప్లస్)లో విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకొని పాఠశాలల ఎంపిక జరిగింది. యూడైస్‌లో ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, బోధన పద్ధతులు, కొన్ని సంవత్సరాలుగా పదో తరగతిలో వస్తున్న గ్రేడ్లు, ఇతర తరగతుల్లో వస్తున్న విద్యార్థుల మార్కుల వివరాలు తదితర వాటిని పరిగణనలోకి తీసుకుంటారు. పాఠశాలల్లో ఆధునిక పద్ధతుల్లో బోధన, ఆహ్లాదకర వాతావరణం ఉంటే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించవచ్చని యోచనతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి, ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు కేంద్రం ఈ పథకం ప్రవేశపెట్టింది. గ్రామ స్థాయిలో జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను అందుబాటులోకి తెచ్చి విద్యార్థులు డిగ్రీకి వెళ్లే సరికి ఏదో ఒక రంగంలో స్థిరపడేలా తీర్చిదిద్దనున్నారు.

**ఆధునిక వసతులు.. సరికొత్త కోర్సులు..**

పీఎంశ్రీ కింద ఎంపికైన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం మూడు విడతల్లో నిధులను కేటాయించనుంది. ఈ నిధులతో మౌలిక వసతులు మారిపోనున్నాయి. ఎంపికైన బడుల్లో సొంత భవనాలు, మరుగుదొడ్లు, స్మార్ట్ క్లాస్ రూంలు, ఆర్ట్‌రూం, సోలార్ ప్యానెళ్లు, ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయనున్నారు. గ్రీన్ స్కూళ్లుగా మార్పు చేయడం, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సేంద్రియ పద్ధతిలో కాయగూరలు పండించడం, వర్షపు రీసైక్లింగ్, మినరల్ వాటర్ సౌకర్యం, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ) ల్యాబ్, డిజిటల్ గ్రంథాలయం, క్రీడలకు ప్రోత్సాహం, నాణ్యమైన విద్యతో పాటు ఇంటర్నెట్ సౌకర్యం, విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ, వృత్తి విద్యా కోర్సులు వంటి వసతులు మెరుగుపడనున్నాయి. పాఠశాల స్థాయి నుంచే ఒకేషనల్ కోర్సులను ప్రోత్సహిస్తారు.

**జిల్లాలో పీఎంశ్రీ కింద ఎంపికైన పాఠశాలలు (మండలం)**

- కొలిమిగుండ్ల మోడల్ స్కూల్
- అవుకు మోడల్ స్కూల్
- ఇల్లూరి కొత్తపేట జెడ్పీహెచ్‌ఎస్ (బనగానపల్లె)
- పేరుసోమల జెడ్పీహెచ్‌ఎస్ (సంజామల)
- కోవెలకుంట్ల గురుకుల పాఠశాల
- వెంకటేశ్వరపురం జెడ్పీహెచ్‌ఎస్ (ఆత్మకూరు)
- బండిఆత్మకూరు మోడల్ స్కూల్
- డోన్ మోడల్ స్కూల్
- దొర్నిపాడు జెడ్పీహెచ్‌ఎస్
- గడివేముల జెడ్పీహెచ్‌ఎస్
- కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్
- మిడుతూరు మోడల్ స్కూల్
- కొణిదెల జెడ్పీహెచ్‌ఎస్ (నందికొట్కూరు)
- హుస్సేనాపురం జెడ్పీహెచ్‌ఎస్ (ప్యాపిలి)
- ఉయ్యాలవాడ మోడల్ స్కూల్
- కోటకందుకూరు మోడల్ స్కూల్ (ఆళ్లగడ్డ)
- రంగాపురం జెడ్పీహెచ్‌ఎస్ (బేతంచెర్ల)
- చాగలమర్రి జెడ్పీహెచ్‌ఎస్
- గోస్పాడు మోడల్ స్కూల్
- జూపాడుబంగ్లా మోడల్ స్కూల్
- తిమ్మాపురం మోడల్ స్కూల్ (మహానంది)
- కొత్తపల్లె జెడ్పీహెచ్‌ఎస్ (నంద్యాల)
- శిరివెళ్ల మోడల్ స్కూల్
- వెలుగోడు మోడల్ స్కూల్
- రుద్రవరం మోడల్ స్కూల్
- పాణ్యం మోడల్ స్కూల్
- పాములపాడు మోడల్ స్కూల్
- ప్రాతకోట జెడ్పీహెచ్‌ఎస్ (పగిడ్యాల)

### పాఠశాలలు మరింత అభివృద్ధి



పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద తీర్చిదిద్దారు. పీఎంశ్రీ పథకం కింద విద్యార్థులు సాంకేతిక రంగాల్లో పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకునేందుకు వీలుంటుంది. అధునాతన బోధన పరికరాలు అందుబాటులోకి వస్తాయి. మరింత నాణ్యమైన విద్య అందుతుంది.

– చంద్రసేనారెడ్డి, ప్రిన్సిపాల్ మోడల్ స్కూల్

### ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరుగుతుంది



ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం కింద సెలెక్ట్ అయిన పాఠశాలలకు అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వస్తాయి. దీని ద్వారా విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరుగుతుంది. నూతన విద్యా విధానం మెరుగుపడుతుంది. అన్నిరకాలుగా తీర్చిదిద్దడంతో ఆదర్శ పాఠశాలలుగా మారుతాయి. విద్యార్థులకు అన్ని రకాల నైపుణ్యాలు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకం తీసుకొచ్చింది. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. – జిలానీ బాషా, ఎంఈఓ

## ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

- కేసు నమోదు చేసిన పోలీసులు

**కోవెలకుంట్ల:** హైకోర్టులో ఉద్యోగం చేస్తున్నానని, వివిధ కోర్టుల్లో తనకు పరపతి ఉందని, ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ అందించిన సమాచారం మేరకు.. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బజత్‌అలీ అనే వ్యక్తి ఏడాది క్రితం కోవెలకుంట్లకు చేరుకుని తాను హైకోర్టులో కీలక పోస్టులో ఉన్నానని అటెండర్ పోస్టు ఇప్పిస్తానని పట్టణానికి చెందిన సుబ్బలక్ష్మి అనే మహిళ నుంచి రూ.1.95 లక్షలు వసూలు చేశాడు. ఏడాది నుంచి ఉద్యోగం ఇప్పించకపోగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితురాలు ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బజత్‌అలీపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.





చెత్తను తొలగిస్తూ..



వామును శుభ్రపరుస్తూ..

# కష్టం..సౌఖ్యం.. కార్మిక శక్తికి వందనం



ఉల్లిగడ్డల బస్తా మోస్తూ..

మనం నడుస్తున్న వీధి శుభ్రంగా ఉండాలి.. మన ఇంటి పక్కన కాలువలో చెత్తాచెదారం ఉండకూడదు..భారీగా బరువులు మోయకుండానే మన గృహ నిర్మాణం పూర్తి కావాలి.. వండే ఆహార పదార్థాల్లో మలినాలు ఉండకూడదు.. ఇవే కాదు ఇంకా ఎన్నెన్నో.. కార్మికుల కష్టంతో మన కోరికలు నెరవేరి, జీవనం సాఫీగా సాగుతోంది. జాతికి వెలుగు అందుతోంది. జగానికంతా సౌఖ్యం నిండుతోంది. విరామమెరుగక పరిశ్రమించే కార్మికుల దినోత్సవం ఈ రోజే. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ కార్మికులకు సలాం చేయాల్సిందే.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



బండి నుంచి ఇసుకను అన్‌లోడ్ చేస్తూ..



మిర్చిని బస్తాల్లోకి కూర్చుతూ..

## వ్యక్తి అదృశ్యం

**కోవెలకుంట్ల:** కలుగొట్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు రేవనూరు ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు. గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి అనే వ్యక్తికి మూడేళ్ల క్రితం ఆత్మకూరుకు చెందిన మమత అనే మహిళతో వివాహమైంది. ఇటీవల భార్యను పుట్టింటి వద్ద వదలిపెట్టి వచ్చాడు. భార్యను ఇంటికి పిలుచుకుని వస్తానని శనివారం మధ్యాహ్నం బయలుదేరి వెళ్లాడు. భార్య ఇంటికి వెళ్లకపోగా తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్దకు వెళ్లి ఉండవచ్చని ఆరా తీశారు. ఆచూకీ తెలియకపోవడంతో సుబ్బారెడ్డి భార్య పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

## వాటర్‌షెడ్లపై అవగాహన కల్పించాలి

**కర్నూలు(అగ్రికల్చర్):** రైతులకు వాటర్‌షెడ్ కార్యాక్రమాలు, సహజ వనరుల వినియోగంపై సమగ్రంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా నీటియాజమాన్య సంస్థ అసిస్టెంటు ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణమోహన్ తెలిపారు.

## వైద్య విజ్ఞాన సదస్సులతో జ్ఞాన సముపార్జన

**కర్నూలు(హాస్పిటల్):** వైద్య విజ్ఞాన సదస్సుల్లో పాల్గొనడం వల్ల వైద్య విద్యార్థులకు జ్ఞానసముపార్జన లభిస్తుందని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ చెప్పారు. ఆదివారం కర్నూలు మెడికల్ కాలేజీలో పల్మనాలజీ, ఆర్థోపెడిక్ విభాగాలు జోనల్–3 నిరంతర వైద్య విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ మాట్లాడుతూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు ప్రతి విభాగం తప్పనిసరిగా సీఎంఈలు నిర్వహించాలని చెప్పారు. దీనివల్ల ప్రపంచంలో ఎప్పటికప్పుడు వైద్యరంగంలో వస్తున్న మార్పులను తెలుసుకుని, జ్ఞానసముపార్జన చేసుకోవచ్చన్నారు. టీబీసీడీ విభాగంలో జరిగిన పల్మనాలజీ సీఎంఈలో పలు అంశాలపై అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అంబరీనాథ్, డాక్టర్ సరిత శామ్యూల్, డాక్టర్ పి. శ్వేత, డాక్టర్ ఎం. సరిత, డాక్టర్ ఫ్రాంక్ మోహన్(నంద్యాల), ప్రొఫెసర్ డాక్టర్ ఏఎస్. శ్రీకాంత్(విజయవాడ), కళాశాలలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో నిర్వహించిన ఆర్థోపెడిక్ సీఎంఈలో పలు అంశాలపై ప్రొఫెసర్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, డాక్టర్ రమణ, డాక్టర్ పి. సుజిత్ దేవప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏఎం. ఇలియాస్ బాషా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగరాణి, రేడియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సురేష్, సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ రవీంద్రబాబు ప్రసంగించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్, టీబీసీడీ హెచ్‌ఓడి డాక్టర్ వెంకటరావు, ఆర్థోపెడిక్ హెచ్‌ఓడి డాక్టర్ శ్రీనివాసులు, వైద్యులు పాల్గొన్నారు.

## ఫార్మాసిస్టుల అసోసియేషన్ అడహక్ కమిటీ ఎన్నిక

**కర్నూలు(హాస్పిటల్):** ఆంధ్రప్రదేశ్ ఫార్మాసిస్టు అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం ప్రాంతీయ శిక్షణ కేంద్రం(ఫిమేల్)లో అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీహరి, ప్రకాశం జిల్లా అధ్యక్షులు పి. శ్రీనివాసరావు సమక్షంలో సభ్యత్వాలు స్వీకరించారు. అనంతరం అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా కె. రంగస్వామి(ప్రాతకోట), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎ. బాషావలి(దేవనకొండ), ఉపాధ్యక్షులుగా బి. రేఖ(కొత్తబురుజు), ఎ. జనార్దనుడు(జీజీహెచ్, కర్నూలు), పి. నాగరాజు(బదినేహాల్), పి. రామకృష్ణయ్య(దైవందిన్నె), జనరల్ సెక్రటరీగా ఎం. రాజేష్ నాయక్(తిమ్మాపురం), జాయింట్ సెక్రటరీలుగా కె. సురేంద్రబాబు(పుచ్చకాయలమడ), ఎం. షేక్ నూర్‌బాషా(షరీన్‌నగర్), బి. పార్వతి(జూపాడుబంగ్లా), వి. లక్ష్మీనారాయణ (సి.బెళగల్), పి. చంద్రశేఖర్(నారాయణపురం) ఎన్నికయ్యారు.



నూతన అడహక్ కమిటీ సభ్యులు



## మల్లన్నను దర్శించుకున్న టీవీ నటి



శ్రీశైలంలో బుల్లితెర నటి రూప

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్లను బుల్లితెర నటి రూప ఆదివారం దర్శించుకున్నారు. వీరు స్వామిఅమ్మవార్ల దర్శన అనంతరం స్వామి అమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించుకున్నారు. కాగా రూప ప్రస్తుతం జీ తెలుగులో ప్రసారం అయ్యే కృష్ణతులసి, కల్యాణం కమనీయం సీరియళ్లలో నటిస్తున్నారు. పలువురు అభిమానులు ఆమెనుగుర్తించి సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు.

## వ్యక్తిపై సీసాతో దాడి

**బొమ్మలసత్రం:** నంద్యాల పట్టణంలో ఆదివారం చెత్త విషయంలో ఘర్షణ పడి ఓ వ్యక్తిపై గాజు సీసాతో దాడి చేశాడు. అవుట్‌పోస్ట్ పోలీసుల సమాచారం మేరకు.. సాయిబాబానగర్‌లో భవన నిర్మాణ కార్మికులు అల్తాఫ్, ఫయాజ్ ఎదురెదురుగా నివాసముంటున్నారు. వీరు ఇంటి ముందు మురుగునీటి కాల్వలో చెత్త విషయంలో ఘర్షణ పడ్డారు. ఫయాజ్ ఆగ్రహంతో అల్తాఫ్‌ను గాజు సీసాతో కడుపులో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబీకులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఫాస్టాక్ లైసెన్సు తప్పనిసరి

**కర్నూలు (టౌన్):** వ్యాపారులు ఫాస్టాక్ లైసెన్సును తప్పనిసరిగా తీసుకోవాలని కర్నూలు, నంద్యాల ఫుడ్ ఆఫీసర్ శేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలు కొత్తబస్టాండ్ సమీపంలోని ఒక హోటల్‌లో ఫుడ్ సేఫ్టీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కాయ్ వంజీ బాబా గ్రామీణ వికాస్ మండల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫుడ్ ఆఫీసర్ మాట్లాడుతూ.. వ్యాపారులు ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు అందించాలన్నారు. ఫాస్టాక్ కేవీజీవీఎం పాన్ ఇండియా శిక్షకులు సింధూజోస్ పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో ప్రభుత్వ కాలేజీ విద్యార్థి ప్రతిభ

- 98.84 పర్సెంటైల్‌తో ఆల్ ఇండియా లెవెల్‌లో 13,509వ ర్యాంకు



ఎల్.చరణ్ కార్తీక్

**కర్నూలు సిటీ:** ప్రభుత్వ జూనియర్(టౌన్‌మోడల్)కాలేజీలో ఇంటర్మీడియెట్ చదివిన ఓ విద్యార్థి ఇటీవల నేషనల్ టెస్టింగ్ ఏజేన్సీ ప్రకటించిన జేఈఈ పరీక్షల ఫలితాల్లో కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ఉత్తమ పర్సెంటైల్ సాధించారు. నగరంలోని ఏక్యాంపు ఉన్న ఎల్.సుధాకర్ బాబు, ఎల్.వరలక్ష్మీ దంపతులకు ఇద్దరు కుమారులు. సుధాకర్ బాబు బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఈయన పెద్ద కుమారుడు లక్ష్మీపురం చరణ్ కార్తీక్ పాఠశాల విద్య ఏక్యాంపులోని మాంటిస్సోరి స్కూల్‌లో చదివారు. ఇంటర్మీడియెట్ మాత్రం ప్రభుత్వ కాలేజీలో చదివి 961 మార్కులు సాధించారు. జేఈఈలో 98.84 పర్సెంటైల్ సాధించి ఆల్ ఇండియా లెవెల్‌లో 13,509వ ర్యాంకు, ఎస్టీ క్యాటగిరీలో 74వ ర్యాంకు సాధించారు. ఢిల్లీ, ఖరగ్‌పూర్ ఐఐటీల్లో రొబొటిక్స్‌లో ఇంజినీరింగ్ చదివిన తరువాత సివిల్స్ పరీక్షలు రాసి ఉన్నతస్థాయి ఉద్యోగం సంపాందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చరణ్‌కార్తీక్ తెలిపారు.



## వికసించిన మే పుష్పం

సరిగ్గా మే నెల ప్రారంభానికి కొన్ని ఘడియల ముందే కర్నూలు నగరం సీక్యాంప్ సెంటర్‌లోని మాజీ కార్పొరేటర్ సురేంద్ర ఇంట్లో మే పుష్పం వికసించింది. లిల్లీ జాతికి చెందిన ఈ మొక్క మే నెలలో పుష్పిస్తుంది. మిగతా కాలం అంతా ఆకులతో కనిపిస్తుంది. మొగ్గ పువ్వుగా విచ్చుకోవడానికి సుమారు ఇరవై రోజుల సమయం పడుతుంది.

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

## 4న అరుణాచలానికి ఇంద్ర ఏసీ బస్సు

**కర్నూలు(రాజ్‌విహార్):** గిరి ప్రదక్షిణ దీపోత్సవం సందర్భంగా తమిళనాడులోని అరుణాచల క్షేత్రం దర్శనం కోసం మే 4వ తేదీన ఇంద్ర ఏసీ ప్రత్యేక బస్సు (సర్వీస్ నంబర్–93998)ను నడపనున్నట్లు కర్నూలు–2డిపో అసిస్టెంట్ మేనేజరు (ట్రాఫిక్) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు గురువారం రాత్రి 8గంటలకు కర్నూలు నుంచి ఈ బస్సు బయలుదేరి, మరుసటి రోజు శుక్రవారం తెల్లవారు జామున 5 గంటలకు అరుణాచలానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వర స్వామి దర్శనం, దీపోత్సవం అనంతరం అదే రోజు సాయంత్రం 4గంటలకు బస్సు బయలుదేరి, దారిలో వేలూరు స్వర్ణ దేవాలయ అమ్మవారి దర్శనం అనంతరం శనివారం ఉదయం 6గంటలకు కర్నూలుకు చేరుకుంటుందని వెల్లడించారు. అరుణాచలం క్షేత్ర దర్శనం రాక, పోకల కోసం ప్రత్యేక బస్సు చార్జీ రూ.2,500 ఉంటుందని, ఇందులో ముందస్తు టిక్కెట్లు తీసుకునేందుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. బస్టాండ్లు, ఏజెంట్లు, ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు పొందవచ్చని, వివరాలకు అసిస్టెంట్ మేనేజరు సెల్ 7382871131, 9959225794 (డిపో మేనేజరు) నంబర్ లేదా సమీపంలోని డిపో మేనేజర్లను సంప్రదించాలన్నారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రాణం తీసిన అతివేగం

**కృష్ణగిరి:** అతివేగానికి ఓ నిండు ప్రాణం బలైంది. అమకతాడు టోల్‌గేట్ సమీపాన జాతీయ రహదారిలో ఆదివారం సాయంత్రం అదుపుతప్పి బైక్ బోల్తా పడిన ఘటనలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వినయ్‌కుమార్(27) మృతి చెందాడు. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేట్‌కు చెందిన శ్రీనివాసులు కుమారుడు వినయ్‌కుమార్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇతను బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు బైక్‌పై వస్తున్నాడు. అతివేగం, అజాగ్రత్తగా వస్తూ అమకతాడు టోల్‌గేట్‌కు అర కిలోమీటర్ దూరంలో బైక్ అదుపుతప్పి బోల్తాపడి రెండు ముక్కలైంది. దీంతో రహదారి పక్కనున్న రాళ్లకు వినయ్‌కుమార్ బలంగా కొట్టుకున్నారు. గమనించిన వారు హైవే పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వెంటనే అక్కడికి చేరుకుని బాధితునికి సీపీఆర్ చేసి వెంటనే 108 అంబులెన్స్‌లో కర్నూలుకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. పర్సులో ఉన్న కార్డుల ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందజేశామని ఎస్‌ఐ తెలిపారు.



మృతి చెందిన వినయ్‌కుమార్

## కాటేసిన కరెంట్ తీగలు

- వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

**ఆలూరు రూరల్/పాణ్యం:** ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేర్వేరు చోట్ల కరెంట్ తీగలు ఇద్దరి ప్రాణాలను బలిగొన్నాయి. హాలహర్వి మండలం కామినేహాల్ గ్రామంలో శనివారం రాత్రి గాలీవానకు చైతన్య కుమార్ (33) ఇంటికి విద్యుత్ కనెక్షన్ కోసం ఏర్పాటు చేసిన సర్వీసు వైరుకు ఉన్న జీఐ వైర్ తెగిపోయింది. ఆదివారం ఉదయం దీన్ని సరి చేస్తూ చైతన్య కుమార్ విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలి మృతిచెందాడు. మృతుడికి భార్య తేజస్విని ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.





మృతి చెందిన చైతన్య, కోటపాడు లక్ష్మయ్య

**ఆలమూరులో..**

పాణ్యం మండల పరిధిలోని ఆలమూరు గ్రామానికి చెందిన కోటపాడు లక్ష్మయ్య(23) ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తాటికాయలను తెంపేందుకు చెట్టు ఎక్కగా పక్కనే ఉన్న విద్యుత్ వైర్లకు తగిలి షాక్‌కు గురై కిందపడి మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

## డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహం

**కర్నూలు(అగ్రికల్చర్):** చేపల వ్యాపారంలో డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి శ్యామలమ్మ తెలిపారు. ఆదివారం కర్నూలు నగరంలో ఫిష్ ఆంధ్ర కింద ఏర్పాటు చేసిన రీటైల్ వెండింగ్ యూనిట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏడాది క్రితంతో పోలిస్తే చేపల వినియోగం గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. రీటైల్ వెండింగ్ యూనిట్లు ఏర్పాటు ద్వారా నిరుద్యోగ యువత ఉపాధి పొందుతుందని పేర్కొన్నారు. వెంకటరమణ కాలనీలో ఫిష్ ఆంధ్ర కింద రీటైల్ అవుట్‌లెట్‌ను నిర్వహిస్తున్న మహిళకు పేటీయం మిషన్‌ను అందచేశారు.ఇప్పటి వరకు 15 మందికి పేటీయం మిషన్‌లను ఉచితంగా పంపిణీ చేసినట్లు వివరించారు.



రెడ్ల సత్రం మార్గంలో కారుపై కూలిన వృక్షం



రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

## శ్రీశైలంలో భారీ వర్షం

**శ్రీశైలం:** శ్రీశైల క్షేత్ర పరిధిలో ఆదివారం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటలకు పైగా వర్షం కారణంతో ఎక్కడి భక్తులు అక్కడే నిలిచిపోయారు. స్వామి దర్శనానికి వెళ్లలేకపోయారు. ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. రెడ్ల సత్రం, ఉమారామలింగేశ్వర దేవాంగసత్రం వెళ్లే దారిలో ఈదురు గాలులకు చెట్టు కూలి అక్కడే పార్క్ చేసిన కారుపై పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో వాహనదారులకు ఎలాంటి ప్రమాదం సంభవించ లేదు.

**జిల్లాలో మోస్తరు వర్షం**

**నంద్యాల(అర్బన్):** శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లాలోని పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. శ్రీశైలం మండలంలో అత్యధికంగా 14.0 మి.మీ వర్షం కురవగా, పాములపాడులో 13.8, దొర్నిపాడులో 12.4, ఉయ్యాలవాడలో 9.8, రుద్రవరంలో 3.8, కోవెలకుంట్లలో 1.8, బేతంచెర్లలో 0.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.